# విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం జైనూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించారు. రిజిస్టర్లు, తరగతిగదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యారంగం బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. వసతిగృహ పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి, సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ఉద్యమ కెరటం, మంచిర్యాల: జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్రభావిత గ్రామాల్లో అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాల్లో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేసి, ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బ్యాక్ వాటర్‌తో నీట మునిగిన మామిడి తోట

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ కుంట సమీపంలోని సర్వే నెం. 400లో గల ఎండి దావూద్ కు చెందిన దాదాపు 3 ఎకరాల వ్యవసాయ భూమిలో గల మామిడి తోట, టేకు చెట్లు, మల్లెపూల తోటలు పోచమ్మ కుంట బ్యాక్ వాటర్‌తో నిండిపోవడంతో మామిడి తోట కాపు కాయక, మల్లె తోట పూల పంట రాక సాగు చేస్తున్న రైతు తీవ్రంగా నష్టపోతున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం మిషిన్ కాకతీయ పనుల్లో భాగంగా పోచమ్మ కుంట చెరువు మత్తడిని సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండానే చెరువు గుత్తేదారు మత్తడిని పెంచడంతో చెరువు బ్యాక్ వాటర్ వ్యవసాయ భూమీలోకి రావడంతో నీరు నిలిచి వ్యవసాయం సాగు చేయకుండా పోతుంది. దీంతో రైతు ప్రతిఏడు నష్టపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి, ఇరిగేషన్ అధికారుల దృష్టికి, ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం జరగలేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ఇదే వ్యవసాయ భూమిలో రైతు వ్యవసాయ బోరుబావిని డ్రిప్పు ను ఏర్పాటు చేసుకుని వ్యవసాయం చేసుకునేవారు. కానీ పోచమ్మ కుంట చెరువు మత్తడిని సామర్థ్యాని కన్నా మించి ఎత్తు పెంచడంతో నీరు నిలిచి తన వ్యవసాయ భూములోకి నీరు వచ్చి నీళ్ళు నెలల తరబడి నిలిచి ఉండడంతో అటు టేకు చెట్లు, ఇటు మామిడి చెట్లు, పూలతోట ఎండిపోయే స్థితికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వ్యవసాయ భూమిలో పోచమ్మ కుంట చెరువు బ్యాక్ వాటర్ నిలువకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

# టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్

**ఉద్యమ కెరటం, కామారెడ్డి ప్రతినిధి:** ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ బిచ్కుందలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం సందర్శించారు. ఏటీసీలో ఉన్న అధునాతనమైన మిషన్స్ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న శిక్షణ, ఏర్పాట్లపై ఆరా తీశారు. మిగిలి ఉన్న కనెక్షన్లను ఏర్పాటు చేసి అన్ని మెషిన్లు వినియోగంలో ఉండేవిధంగా, ప్రాక్టికల్స్ అన్ని కూడా విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా తగు సూచనలు చేశారు. ఏటీసీ ముందు భాగంలో ఉన్న పరిసరాల శుభ్రత పై దృష్టి పెట్టాలని జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. విద్యార్థులు అధునాతన నైపుణ్యాన్ని నేర్చుకొని భవిష్యత్తులో అత్యుత్తమైన స్థాయికి ఎదగాలని సూచించారు. అలాగే బాన్సువాడ డివిజన్ సబ్ కలెక్టర్ కే కిరణ్మయి విద్యార్థులను ఏటీసీలో ఉన్న కోర్సులు, అధునాతన మెషిన్లు ఇంకా ఎక్కడ ఉండవని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఏటీసీ బిచ్కుంద ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, బిచ్కుంద తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో గోపాల్, టీజీఐఐసీ నిజామాబాద్ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.





# గంజాయిపై ఉక్కుపాదం

## 160 గంజాయి మొక్కలు స్వాధీనం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అసోద గ్రామానికి మిశ్రమ్ భుజంగరావు అనే రైతు తన పంట పొలంలో గంజాయి మొక్కలు సాగుచేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్ ప్రత్యేక బృందంతో పంటచేలలో తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పత్తి, కంది పంటల మధ్యలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరిస్తూ గంజాయి రవాణా చేసినా, సేవించినా, సాగు చేసినా, వ్యాపారం చేసే వారిపై చట్ట కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతర్గత పంటగా సాగు చేస్తున్న 160 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ బహిరంగ మార్కెట్లో రూ.16 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. గంజాయి పండిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా జిల్లా కలెక్టర్ కు నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న రూరల్ సీఐ కె ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్, విఠల్, సురేష్ లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు వివరించారు.

# చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దింటి ప్రభాకర్(64) అనే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభాకర్ మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన గురువారం ఉదయం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాజేశ్వరితో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# వ్యాసరచన పోటీలు

**ఉద్యమ కెరటం, వేములవాడ:** వేములవాడ లయన్స్ క్లబ్, వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వేములవాడ సరస్వతి శిశు మందిర్‌లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు జ్ఞాపకశక్తి పోటీల్లో ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రముఖ సైకాలజిస్ట్ డా. ప్రవీణ్‌తో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సరస్వతి శిశుమందిర్ వారు కోరగా వేములవాడ లయన్స్ క్లబ్, వేములవాడ రాజన్న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారం అందిస్తామని డా. సంతోష్ కుమార్, కొలిపాక నర్సయ్య హామీ ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ బచ్చి వంశీకృష్ణ, డా.మనోహర్, డా.శ్రీనివాస్, డా.కోహినేని ప్రవీణ్ , మోటూరి మధు, ప్రధానాచార్యులు రాంప్రసాద్, ఘర్షకుర్తి వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రయాణం ప్రాణసంకటం

• గుంతలమయంగా మారిన • వాహనదారులకు తప్పని తిప్పలు



**ఉద్యమ కెరటం, హత్నూర:** హత్నూర రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. అడుగడుగునా ఏర్పడ్డ గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే అంతే సంగతి. గమ్యానికా.. పైలోకానిక అన్నట్లుగా మారిది. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి ప్రమాదాలకు గురై ఎంతోమంది తమ ప్రాణాలు కోల్పోయారని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే హత్నూర గ్రామంలోని ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి అటు వాహనదారులు ఇటు గ్రామస్తులు ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. దౌల్తాబాద్ గ్రామం నుం%ఎతీ% మొదలై హత్నూర ఐ%ఓ‌ష%ఐ గోవిందరాజుపల్లి సిరిపుర గ్రామం వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు సైతం ప్రమాదవశాత్తు ప్రమాదాలకు గురై మంచాన బారిన పడుతున్నారనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా సంబంధిత ఆర్‌అండ్ బి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాని ప్రజలు మండిపడుతున్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమా, సంబంధిత అధికారుల నిర్లక్ష్యమా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్ బి అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన హత్నూర ప్రధాన రోడ్డును మరమ్మతులు చేయించే విధంగా శాఖా పరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 58 మందికి కోర్టు శిక్ష



**ఉద్యమ కెరటం, కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** జిల్లాలో మద్యం సేవించి వాహనలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మద్యం సేవించి వాహనం నడిపినవారు స్వయంగా ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతుండగా, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కామారెడ్డి జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి జిల్లా వ్యాప్తంగా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వాహనదారులను కోర్టులో హాజరుపర్చడం ద్వారా జరిమానాలతో పాటు జైలు శిక్షలు పడుతున్నాయి.

## ఒకేరోజు 58 మందికి శిక్ష..

దేవునిపల్లి పీఎస్ లో 10 మందికి జైలు శిక్ష పడగా, నలుగురికి 2 రోజులు, ఆరుగురికి ఒక రోజు జైలుతో పాటురూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. దోమకొండ పీఎస్ లో ఒక వ్యక్తికి 2 రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా, మాచారెడ్డి, కామారెడ్డి, బిక్నూరు పీఎస్ లో ఒక్కొక్కరికి ఒకరోజు జైలుతో పాటు రూ.వెయ్యి జరిమానా వేశారు. కామారెడ్డి 14 మంది, రామారెడ్డి 1 వ్యక్తి, దేవునిపల్లి 20 మంది, బిక్నూరు 1 వ్యక్తి, దోమకొండ 6 మంది, రాజంపేట్ 1 వ్యక్తి, సదశివ నగర్ 1 వ్యక్తి మొత్తం 44 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర మాట్లాడుతూ కుటుంబ సభ్యుల, ఇతరుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు. మీ నిర్లక్ష్యంతో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు వికలాంగులై జీవితాంతం బాధపడుతున్నారని పేర్కొన్నారు.

